క్లుప్తంగా

దివ్యాంగునికి ఆర్థిక సాయం



దివ్యాంగుడు ఏడుకొండలుకు ఆర్థిక సహాయం అందజేస్తున్న రాజేష్

తాళ్లరేవు: ఎటువంటి తోడులేని దివ్యాంగుడు నేరేడిమిల్లి ఏడుకొండలుకు గొల్లపాలెం లయన్స్ క్లబ్ సెక్రటరీ జక్కన రాజేష్ రూ.మూడు వేల ఆర్థిక సహాయం అందజేశారు. రాజేష్ తన పుట్టినరోజు సందర్భంగా తాళ్లరేవులో పలు సేవా కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక జెల్లావారిపేట గ్రామానికి చెందిన ఏడుకొండలు గృహ నిర్మాణం చేసుకుంటున్న సందర్భంగా సాయం చేశారు. ఆయన వెంట తాళ్లరేవు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, నున్న దత్తు తదితరులు ఉన్నారు.

బహిరంగంగా మద్యపానం

యానాం: స్థానిక బైపాస్ రహదారి ఇరువైపులా ఉన్న మద్యం షాపుల ఎదురుగానే బహిరంగంగా మద్యం తాగుతున్నప్పటికీ ఎక్సైజ్ సిబ్బంది చోద్యం చూస్తున్నారని ఆదివారం సోషల్ యాక్టివిస్ట్ పెసల వెంకటేష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత మద్యం షాపుల యాజమాన్యాలు సైతం పట్టించుకోవడం లేదని, దీంతో మందుబాబులు బహిరంగంగా మద్యం తాగుతున్నారని అన్నారు. దీనివల్ల రహదారిపై వెళ్లే పాదచారులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. బహిరంగంగా మద్యం తాగేవారిపై కేసులు ఎందుకు నమోదు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. ఎక్సైజ్ నిబంధనలు పాటించని షాపుల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, షాపుల వద్ద మద్యం ఎమ్ఆర్‌పీ ధరల పట్టికను సైతం ప్రదర్శించాలని ఆయన డిమాండ్ చేశారు.

సేంద్రియ సాగుకు రాయితీలు

యానాం: ఇళ్ల మేడలపై సేంద్రియ కూరగాయల సాగుకు రాయితీ పద్ధతిన వివిధ సొకర్యాల కల్పనకు 5 వేల గృహాలను ఎంపిక చేసినట్లు పుదుచ్చేరి వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు ఆదివారం విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం ప్రజలు రసాయనాలు వినియోగించని సేంద్రియ కూరగాయల కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఇళ్లపై సాగు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. మొదటి ఫేజ్‌లో ఐదువేల గృహాల టెర్రాస్ గార్డెన్‌లకు సంబంధిత ఎక్విప్‌మెంట్ అందజేస్తామన్నారు. ఆ విధంగా 150 గ్రూపులను ఏర్పాటు చేసి 3 వేల మందికి వందశాతం రాయితీపై పరికరాలను అందజేస్తామన్నారు. అదేవిధంగా 20 రకాల కాయగూరల విత్తనాలు, బ్యాగ్‌లు, సీడింగ్ ట్రే, సేంద్రియ ఎరువు, స్ప్రింకలర్, కావాల్సిన ప్లాస్టిక్ పైపులు, 20 అడుగుల షేడ్‌టెంట్, నెట్ తదితర వాటిని అందజేస్తామన్నారు.

29న బీఎస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్ష

యానాం: సెంటాక్ ప్రభుత్వ కోటాకు సంబంధించి బీఎస్సీ నర్సింగ్ సీట్ల భర్తీకి ఈ నెల 29న ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆర్ఏఓ మునిస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరిగే పరీక్షకు యానాం రీజియన్‌లో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆ విధంగా రాజీవ్ గాంధీ ఇంగ్లిషు మీడియం ప్రభుత్వ హైస్కూల్ కేంద్రంలో 54 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారన్నారు. ఈ పరీక్షకు జోనల్ సూపర్‌వైజర్‌గా పుదుచ్చేరి విద్యుత్ శాఖ ఓఎస్‌డీ పి.సావిత్రిని నియమించారన్నారు.

కూటమిలోని పార్టీలకు షాక్

యానాం: పుదుచ్చేరి అసెంబ్లీకి వచ్చే ఏడాది మార్చిలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే పార్టీ 20 సీట్లలో పోటీ చేస్తుందని ఆదివారం ప్రతిపక్ష నేత శివ ప్రకటించడంతో కాంగ్రెస్‌తో సహా కూటమిలోని ఇతర పార్టీలు షాక్‌కు గురయ్యాయి. 20 సీట్లలో డీఎంకే పార్టీ, మిగిలిన 10 సీట్లు కాంగ్రెస్ తదితర పార్టీలకు కేటాయిస్తామని ఆయన ప్రకటించారు. డీఎంకే, కాంగ్రెస్ కలసి ఇండియా కూటమి ఆధ్వర్యంలో పోటీచేసి అధికారం చేజిక్కించుకుందామనే లక్ష్యంతో వెళుతున్న నేపథ్యంలో శివ ప్రకటన మిగిలిన మిత్ర పార్టీలను ఆశ్చర్యపరిచాయి.

నేడు కంటి వైద్య శిబిరం

తాళ్లరేవు: క్రీమ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు దొమ్మేటి వసంతరావు, దొమ్మేటి సామ్యూల్‌సాగర్ తెలిపారు. స్థానిక సంతపేట సెంటర్‌లోని హైస్కూల్ పక్కన బాప్టిస్టు చర్చిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఈ శిబిరం నిర్వహిస్తారు. పిఠాపురం సీఎంసీ నేత్ర వైద్య నిపుణులచే పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేయడంతోపాటు ఉచిత ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని తాళ్లరేవు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సామ్యూల్ సాగర్ కోరారు.

నిత్యావసర సరకుల అందజేత

యానాం: సావిత్రినగర్ తీర గ్రామంలో ఇటీవల సంగాడి అప్పారావు మృతి చెందగా, అతని కుటుంబానికి ఆదివారం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్దాని దినేష్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా బియ్యం, నూనె తదితర వస్తువులను ఆ కుటుంబానికి అందజేశారు. నాయకులు మెల్లం చిన్న, సావిత్రినగర్ యువత అధ్యక్షుడు అశోక్, వైదాడి శ్రీను, పోతుల కొండబాబు, హర్ష తదితరులు పాల్గొన్నారు.

కన్నీటి కష్టాలు

- పట్టణంలో అడుగంటిన రిజర్వాయర్
- కుళాయిల నుంచి మురికినీరు
- వంతెనల నిర్మాణంతో కాలువకు నీటి విడుదలలో జాప్యం



అమలాపురంలో అడుగంటిన మున్సిపాలిటీ రిజర్వాయర్ (చెరువు)

అమలాపురం టౌన్: తాగేందుకు గుక్కెడు నీరే గగనమైంది.. వచ్చేది అరకొర, ఆపై కలుషితం కావడంతో 'క'న్నీటి' కష్టం వెంటాడుతోంది.. జిల్లా కేంద్రం అమలాపురం మున్సిపాలిటీలో పరిస్థితి ఇది. ఇక్కడి ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. కుళాయిల నుంచి వచ్చే అరకొర నీరూ మురికిగా వస్తున్నాయని గగ్గోలు పెడుతున్నారు. ఓ పక్క ఈదరపల్లి, నడిపూడి వద్ద పంట కాలువపై కొత్త వంతెనల నిర్మాణాలతో ఆ కాల్వకు నీరు విడుదలలో జరుగుతున్న జాప్యం కూడా మున్సిపాలిటీ తాగునీటి వనరుల నిల్వలపై పడుతోంది. కాలువలకు నీరు విడుదల చేసినప్పటికీ ఈదరపల్లి, నడిపూడి వైపు కాలువకు ఆ రెండు వంతెనల నిర్మాణంతో ఇంకా కాలువ నీరు వదలలేదు. మున్సిపాలిటీకి తాగునీటికి రా వాటర్ పంట కాలువల నుంచి వచ్చే గోదావరి జలాలే. కాలువకు నీరు రావడంలో జరుగుతున్న జాప్యం వల్ల స్థానిక వాటర్ వర్క్స్ విభాగానికి సమీపంలో ఉన్న ఓ తాగునీటి చెరువు (రిజర్వాయరు)లో నీరు అడుగంటిపోయింది. దీంతో ఆ చెరువు నుంచి నీటి పంపింగ్ జరగడం లేదు. మున్సిపాలిటీకి ఉన్న మూడు రిజర్వాయర్లలో ఒకటి అడుగంటడం, అందులో చేపలు చనిపోయి తేలుతుండడంతో ఆ చెరువు నుంచి పంపింగ్ నిలిచిపోయింది. మిగిలిన రెండు చెరువుల్లో ఉన్న కొద్దిపాటి కాలువ నీటి నిల్వలతో పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా అరకొరగా జరుగుతోంది. మరోపక్క మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది దాదాపు 38 రోజులుగా సమ్మెలో ఉన్న ప్రభావం కూడా తాగునీటి సరఫరాపై స్పష్టంగా పడుతోంది. స్కిల్డ్ వర్కర్లుగా ఉన్నవారు తాగునీటి సరఫరా విభాగంలో నైపుణ్యంతో పనిచేసేవారు. ఇప్పుడు వారు సమ్మెలో ఉండడంతో తాగునీటి సరఫరాకు టెక్నీషియన్లు కరవయ్యారు.

పూర్తిస్థాయి ఫలితాలు ఎక్కడా!

రెండు వంతెనల నిర్మాణంతో ఆగిన కాలువ నీరు, ఇంజినీరింగ్ వర్కర్ల సమ్మెతో పట్టణంలో అనివార్యమైన తాగునీటి సమస్యల పరిష్కారానికి మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ మార్గాలు పూర్తి స్థాయిలో ఫలితాలను ఇవ్వడం లేదు. మున్సిపాలిటీకి ఉన్న ఎనిమిది మంది రెగ్యులర్ వర్కర్లు, వార్డు సచివాలయల్లో ఉన్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తాగునీటి విభాగంలో విధులు నిర్వహిస్తున్నా వారు ఇంజినీరింగ్ వర్కర్ల అంత స్కిల్డ్‌గా పనిచేయలేకపోతున్నారు. అసలే మున్సిపాలిటీ దాదాపు 15కి పైగా శివారు ప్రాంతాలకు సాధారణ సమయాల్లో కూడా ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తోంది. ఇప్పుడు సిబ్బంది సమ్మెతో పలు వార్డుల్లో తాగునీటి పరిష్కారానికి ట్యాంకర్ల ద్వారా ఎక్కువ వార్డులకు పంపిస్తున్నా అవి ప్రజలు అవసరాలను తీర్చలేకపోతున్నాయి. వడ్డిగూడెం, గాంధీ నగర్, కార్మిక నగర్ తదితర ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీరు పంపిస్తున్నా అక్కడి ప్రజల దాహార్తిని పూర్తి స్థాయిలో తీర్చలేకపోతున్నాయి.

కాలువకు నీరు వచ్చిన వెంటనే పంపింగ్

పంట కాలువలకు నీరు విడుదలైనప్పటికీ ఈదరపల్లి, నడిపూడి వంతెనల నిర్మాణాలతో కాస్త జాప్యం జరిగింది. ప్రస్తుతం శ్లాబ్‌ల దశకు చేరుకున్న వంతెనల నిర్మాణాలతో ఈ పరిస్థితి అనివార్యమైంది. రెండు రోజుల్లో మున్సిపల్ రిజర్వాయర్లకు పంట కాలువ నీరు పూర్తి స్థాయిలో పంపింగ్ చేస్తాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

– సూర్యభాస్కరరావు, ఏఈ, అమలాపురం మున్సిపాలిటీ



పంట కాలువపై శ్లాబ్ దశకు చేరుకున్న ఈదరపల్లి వంతెన పనులు

సూపర్ సిక్స్ హామీల అమలులో విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

తాళ్లరేవు: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో తీవ్రంగా విఫలమైందని సీపీఎం మండల కమిటీ కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు విమర్శించారు. ఆదివారం స్థానిక ప్రజా సంఘాల భవనంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలైన నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ.1,500 సాయం, రైతులకు రూ.20 వేలు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తదితర హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. కనీసం అభివృద్ధి కార్యక్రమాలను కూడా పూర్తి స్థాయిలో చేయడం లేదని విమర్శించారు. జి.వేమవరం నుంచి కరప మండలం గొర్రిపూడి వరకూ రోడ్డు, తాళ్లరేవు మండలం ఇంజరం వద్ద వంతెన నిర్మించాలని, అరటికాయలంక నుంచి మసకపల్లి వరకూ గోదావరి గట్టును వెడల్పు చేసి రివెట్‌మెంట్ కట్టించి ఆయా గ్రామాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు వల్లు రాజబాబు, డి.అదృష్టదీపుడు, సీహెచ్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



చల్లపల్లిలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు, బీఎస్పీ ఇన్‌చార్జ్ మోహన్

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి పంచాయతీ పరిధి బందరుపేటలో కొన్ని రోజులుగా తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, అధికారులు తక్షణమే తాగునీటిని అందించాలంటూ ఆదివారం ఖాళీ బిందెలతో ఆ ప్రాంత మహిళలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అమలాపురం నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జ్ పాలమూరి మోహన్‌బాబు నిరసనకారులకు తన మద్దతును తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో చాలా గ్రామాల్లో తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నీటిని అందించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. జిల్లా అధికారులు స్పందించి గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా నివారించాలని ఆయన డిమాండ్ చేశారు.

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు

అమలాపురం టౌన్: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించే దిశగా రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఉన్నతాధికారులతో కమిటీలను నియమించి, న్యాయ విచారణకు ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు డిమాండ్ చేశారు. అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం అగ్రిగోల్డ్ బాధితుల జిల్లా సమావేశం జరిగింది. దీనికి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పులపర్తి సురేష్‌కుమార్ అధ్యక్షత వహించారు. కాలయాపన లేకుండా కమిటీలు, ప్రత్యేక కోర్టు ఏర్పాటును త్వరితగతిన చేపట్టాలని సమావేశం ప్రభుత్వానికి సూచించింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీవీ నాయుడు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. తమకు న్యాయం జరగకపోతే మళ్లీ ఉద్యమబాట పడతామని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దాదాపు 22 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితుల కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని న్యాయం చేయాలన్నారు. అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా గౌరవాధ్యక్షుడు కె.సత్తిబాబు, జిల్లా కార్యదర్శి లంకేష్, కోశాధికారి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

సాగులో విత్తన ఎంపికే కీలకం

- తద్వారా నాణ్యమైన దిగుబడులు
- నేల స్వభావాన్ని బట్టి రకాలు అవసరం



గత ఖరీఫ్‌లో కొత్తపేటలో కేళీల చేనును పరిశీలిస్తున్న ఏఓ పద్మలత (ఫైల్)

కొత్తపేట: ఏ పంటకైనా మొట్టమొదటగా ప్రధానమైనది విత్తన ఎంపిక. నాణ్యమైన, నమ్మకమైన విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేస్తే అధిక దిగుబడులు సాధిస్తారని వ్యవసాయ అధికారులు సూచించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులను ముందస్తు సాగుకు సమాయత్తం చేసేందుకు కాలువలకు నీరు వదిలారు. నైరుతి రుతుపవనాలతో వర్షాలు పడుతుండడంతో రైతులు వరి సాగుకు సమాయత్తమవుతున్నారు. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో రైతులు నారుమళ్ల తయారీకి ఉపక్రమిస్తున్నారు. అన్ని ప్రాంతాల్లో సార్వా సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. రైతులు తమ భూముల స్వభావాన్ని బట్టి రకాలు సాగు చేసుకోవాలని, వరి నారుమడి నుంచి యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మలుచుకోవచ్చని వ్యవసాయ శాఖ కొత్తపేట సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ) ఎం.వెంకటరామారావు రైతులకు సూచించారు.

ఖరీఫ్ పంటకు అనువైన రకాలు

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 140 రోజుల పంట రకం ఎంటీయూ–7029 (స్వర్ణ), 160 రోజుల రకం ఎంటీయూ–1318 వంటి గవర్నమెంట్ ఆధారిత రకాలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. వినియోగదారులకు ఇష్టమైన 150 రోజుల పంట కాలం ఎంటీయూ 1262 (మార్టేరు మసూరి సన్నాలు), 140 రోజుల ఎంటీయూ 1224 (మార్టేరు సాంబ) రకాలు కూడా సాగు చేస్తున్నారు.

బిల్లులు తీసుకోవాలి

ప్రస్తుతం వరి విత్తనాలు 80 శాతం మేర రైతు నుంచి రైతు కొనుగోలు చేసుకుని సాగు చేస్తుండగా 20 శాతం ఏపీ సీడ్స్ (ఆర్ఎస్‌కే), ప్రైవేట్ డీలర్ల నుంచి కొనుగోలు చేస్తున్నారు. నమ్మకమైన రైతుల నుంచి విత్తనాలు సేకరించుకోవాలి. ప్రైవేట్ విత్తనాల షాపుల్లో కొన్నప్పుడు బిల్లు కచ్చితంగా తీసుకోవాలి. ఆ విత్తనం బ్యాగు భద్రపరచాలి. భౌతిక స్వచ్ఛత చూసుకోవాలి. మొలక కట్టుకోవాలి. నూటికి 80 గింజలు మొలక వస్తేనే మంచి నాణ్యమైన విత్తనంగా గుర్తించి వినియోగించాలి. ప్రైవేట్ డీలర్ల వద్ద ధాన్యం గోనె పట్టా విప్పి నమ్మకం కలిగితేనే వాడాలి. లేకుంటే తిరిగి ఇచ్చేయాలి. ఎందుకంటే గత ఖరీఫ్ సీజన్‌లో కొత్తపేట, ముమ్మిడివరం, ఐ.పోలవరం తదితర ప్రాంతాల్లో, గడచిన రబీ సీజన్‌లో చిరతపూడి తదితర ప్రాంతాల్లో అనేకమంది రైతులు ఒక వరి రకం విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేయగా, వేరే రకాలు (కేళీలు) కలసి తీవ్రంగా నష్టపోయారు. వ్యవసాయ అధికారుల చర్యలు తీసుకుని సంబంధిత కంపెనీ వారితో రైతులకు కొంతమేర నష్టపరిహారం ఇప్పించారు.

విత్తన శుద్ధి అవసరం

వరినాటి పద్ధతిలో ఎకరానికి 20 నుంచి 25 కిలోలు, వెదజల్లు పద్ధతిలో ఎకరానికి 12 నుంచి 15 కిలోల విత్తనాలు సరిపోతాయి. విత్తనం ద్వారా వ్యాప్తి చెందే కొన్ని రకాల తెగుళ్ల అరికట్టడానికి తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలి. విత్తనశుద్ధిలో ఒక లీటరు నీటిలో 10 గ్రాములు సూడోమోనస్ మందును కలిపి ఆ ద్రావణంలో ఒక కిలో విత్తనాల వంతున 36 గంటలు నానబెట్టి, మరో 24 గంటలు మండి కట్టి మొలకవచ్చిన విత్తనాలను దమ్ము చేసిన నారుమడిలో చల్లుకోవాలి. 20 రోజులకు నారు తీసి నాటుకోవాలి. కోనసీమ ప్రాంతంలో వెదజల్లు పద్ధతి అంత అనుకూలం కాదు.

పుదుచ్చేరికి ఉప రాష్ట్రపతి

యానాం: భారత ఉప రాష్ట్రపతి, పుదుచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ధన్‌ఖర్ ఆదివారం పుదుచ్చేరికి విచ్చేశారు. అక్కడి విమానాశ్రయంలో ఆయనకు ఎల్జీ కె.కైలాస్‌నాథన్, సీఎం రంగసామి, హోమ్‌మంత్రి నమశ్శివాయం, పార్లమెంట్ సభ్యుడు వైథిలింగం, మాజీ సీఎం నారాయణసామి, పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. సోమవారం పుదుచ్చేరి జిప్‌మెర్ ఆసుపత్రిలో అబ్దుల్‌కలామ్ ఆడిటోరియంలో జరిగే ఎన్విరాన్‌మెంటల్ సస్టైన్‌బిలిటీ ఇన్ నేషన్ బిల్డింగ్ అనే అంశంపై జరిగే కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తారని జిప్‌మెర్ డైరెక్టర్ వీర్‌సింగ్‌నేగీ తెలిపారు. 17న పుదుచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో జరిగే కార్యక్రమానికి వైస్ చాన్సలర్ హోదాలో హాజరుకానున్నారు.

ఇరువర్గాలపై కేసు

అల్లవరం: దాడి నేపథ్యంలో ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని అల్లవరం పోలీసులు ఆదివారం తెలిపారు. వారి కథనం ప్రకారం.. అల్లవరం వీరన్న మెరకలో ఈ నెల 9న కడలి నాగేంద్ర కిరణ్‌కుమార్ కుమార్తెతో అతని మేనల్లుడు, అమలాపురం సూర్య నగర్‌కు చెందిన దేవీసుధీర్ అసభ్యకరంగా ప్రవర్తించాడన్న కారణంతో ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో దేవీసుధీర్ తన మేనమామ కిరణ్‌కుమార్‌పై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే ఘర్షణలో తన అన్న కిరణ్‌కుమార్ తనపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడని రేణుకా మహాలక్ష్మీ ఫిర్యాదు చేసింది. కిరణ్‌కుమార్ అల్లవరం సీహెచ్‌సీలో, రేణుకా అమలాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుమలరావు వివరించారు.

గోడిలంకలో చోరీ

అల్లవరం: గోడిలంక ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న కుడుపూడి నాగ వెంకటరమణ ఇంట్లో ఈ నెల 12న గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 50 గ్రాముల బంగారం, రూ. 15 వేలు చోరీ చేశారు. వెంకటరమణ ఉద్యోగ రీత్యా వైజాగ్‌లో ఉంటున్నారు. ఈ నెల 12న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. వెంకటరమణ, అతని కుటుంబ సభ్యులు వైజాగ్ నుంచి వచ్చి పరిశీలించగా బీరువాలోని బంగారం, నగదు చోరీ జరిగిందని గుర్తించి అల్లవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తిరుమలరావు తెలిపారు.

ఘనంగా వనుములమ్మ తీర్థం



విలసలో వనుములమ్మ అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

అయినవిల్లి: మండలంలోని విలస గ్రామదేవతగా పూజలందుకుంటున్న వనుములమ్మ వారికి జాతర, తీర్థ మహోత్సవాలు ఆదివారం నిర్వహిస్తున్నారు. ఈ మహోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. కమిటీ ఆధ్వర్యంలో యువత పంట పొలాల నుంచి తీసుకువచ్చిన రెండు తాళ్లను అమ్మవారి ఆలయం ఎదుట నిలబెట్టి పాతారు. ప్రత్యేక పూజలు అనంతరం తాళ్లలకు ఊయల వేసి అమ్మవారికి ఊయల సేవ నిర్వహించారు. గరగ నృత్యాలు, చిత్ర విచిత్ర వేషధారణలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారికి కానుకలు, మొక్కులు చెల్లించారు. అలాగే మండలంలోని తొత్తరమూడిలో మురుగులమ్మవారికి, మాగం కనకమహాలక్ష్మీ, మరిడమ్మలకు సోమవారం జాతర, మంగళవారం తీర్థ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అభ్యుదయ యుగకర్త మహాకవి శ్రీశ్రీ



శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కవులు, సాహితీవేత్తలు

అమలాపురం టౌన్: ఆధునిక తెలుగు కవిత్వాన్ని అభ్యుదయ యుగకర్త మహా కవి శ్రీశ్రీ మరో మలుపు తిప్పారని శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు, సాహితీవేత్త నల్లా నరసింహమూర్తి అన్నారు. శ్రీశ్రీ కళావేదిక జిల్లా శాఖ, కోనసీమ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక గాంధీ బజార్‌లోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఆదివారం జరిగిన మహాకవి శ్రీశ్రీ వర్ధంతి సభలో నరసింహమూర్తి మాట్లాడారు. తొలుత శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీశ్రీ మహాప్రస్థానంలోని జయభేరి కవిత ఖండిక అభ్యుదయ కవిత్వానికి నాంది శ్లోకంగా చెప్పవచ్చని నరసింహమూర్తి అన్నారు. కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు, కవి బీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీశ్రీ రాసిన ఖడ్గ సృష్టి కావ్యానికి 1973లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించిందంటే ఆయన కవితా వైభవ చరిత్రను చాటుతోందని వివరించారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో శ్రీశ్రీ కవితా వైభవంపై కవితా గానాలను కవులు వినిపించారు. కవులు, కవితాభిమానులు కడలి సత్యనారాయణ, శ్రీపాద రామకృష్ణ, దొడ్డి సత్యవేణి, చిక్కాల రవిశంకర్, ఏడిద నారాయణరావు, ఆర్.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న జిల్లా 104 వాహన ఉద్యోగులు

అమలాపురం టౌన్: 104 వాహన ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్ డిమాండ్ చేశారు. 104 వాహనాలను నిర్వహించిన సంస్థ అరబిందో ఆ ఉద్యోగులకు ఇవ్వాల్సిన రెండు నెలల బకాయి వేతనాలను చెల్లించాలని స్పష్టం చేశారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం 104 ఉద్యోగుల జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఆ ఉద్యోగుల జిల్లా సంఘం అధ్యక్షుడు పలివెల చంద్రశేఖర్ మాట్లాడుతూ అరబిందో సంస్థ ఇవ్వాల్సిన రెండు నెలల వేతనాలు ఇవ్వకపోవడం ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పితాని త్రిమూర్తులు విజ్ఞప్తి చేశారు. తమకు మొత్తం ఆర్జిత సెలవులు ఇవ్వాలని, గ్రాట్యుటీ చెల్లించాలని ఆయన డిమాండు చేశారు. అనంతరం ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఓం ప్రకాష్, సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వనచర్ల శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.జగ్జీవనరావు ప్రసంగించారు. అనంతరం సీఐటీయూ కార్యాలయం వద్ద తమ డిమాండ్ల సాధన కోసం నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



ఉద్యానంలో మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు

అమలాపురం రూరల్: ప్రధాని మోదీ పిలుపు మేరకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా పట్టణంలోని చంద్రబాబు ఉద్యాన వనంలో బీజేపీ నాయకులు మొక్కలను నాటారు. పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు అరిగెల తేజ వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు యాళ్ల దొరబాబు, పాలూరి సత్యానందం, మోకా వెంకట సుబ్బారావు, దూరి రాజేష్, కొండేటి ఈశ్వర్ గౌడ్, చిట్టూరి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివార్ల కల్యాణం



ర్యాలిలో జగన్మోహినీ కేశవస్వామి కల్యాణం చేస్తున్న పండితులు

కొత్తపేట: పురాణ ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవస్వామివారి శ్రవణ నక్షత్ర మాస కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేదపండితులు ఆధ్యాత్మిక వ్యాఖ్యానం నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. దేవస్థానం తరఫున ఈఓ రమణమూర్తి పట్టువస్త్రాలు సమర్పించగా, పలువురు భక్తులు కూడా పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ర్యాలి పరిసర గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. తదుపరి మాస కల్యాణం వచ్చే నెల 13న జరుగుతుందని ఈఓ రమణమూర్తి తెలిపారు. భక్తులు అత్యధికంగా ఈ కల్యాణోత్సవంలో పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం

ఆత్రేయపురం గ్రామంలో వేంచేసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్తలు, పోషకులు పాతపాటి రామాంజనేయరాజు, పాతపాటి వెంకటసత్యనారాయణరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా శ్రవణా నక్షత్రం పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకుడు వాడపల్లి పవన్‌దీక్షితుల ఆధ్వర్యంలో వేదపండితులు స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలువురు భక్త దంపతులు పట్టువస్త్రాలు, కల్యాణ సామగ్రి, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఆత్రేయపురం పరిసర గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకుడు గోరింట విజయ్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో కల్యాణ ఏర్పాట్లు చేసి, భక్తులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.